

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 02-12-2022 సంపుటి : 04 సంచిక :90 పేజీలు : 4 వెల : రూ 3-00


# 104 వాహనాలు సమకూర్చుకుని ఖాళీల్లో సిబ్బందిని భర్తీ చేయాలి: సీఎం జగన్



తాడేపల్లి:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఆరోగ్యశ్రీ, నాడు-నేడు కార్యక్రమాలు తదితర అంశాలపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష జరిపారు.అయితే, అక్టోబరు 21న ప్రారంభించిన ఫ్యామిలీ డ్యాక్టర్ కాన్సెప్ట్ పైలెట్ ప్రాజెక్టు అమలుపై సీఎం జగన్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు అమలుకోసం తీసుకుంటున్న చర్యలను, పైలెట్ ప్రాజెక్టు అమలులో గుర్తించిన అంశాలను అధికారులు వివరించారు.ఈ క్రమంలో అధికారులు.. 26 జిల్లాల్లో నెలరోజుల వ్యవధిలో 7,166 విలేజ్ క్లినిక్స్‌లలో రెండుసార్లు చొప్పున, 2,866 విలేజ్ క్లినిక్స్‌లలో ఒకసారి చొప్పున ఫ్యామిలీ డాక్టర్ 104 వాహనంతో పాటు వెళ్లారని తెలిపారు. డిసెంబర్‌లో అదనంగా మరో 260.. 104 వాహనాలు సమకూర్చుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో పూర్తిస్థాయిలో 104 వాహనాలు అందుబాటులోకి రానున్నట్టు స్పష్టం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వల్ల వైద్య సిబ్బందిలో వివిధ విభాగాల మధ్య సమన్వయం, సమర్థత గణనీయంగా పెరిగాయన్నారు.సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలు, గర్భవతుల ఆరోగ్యంపైన కూడా పరిశీలన చేస్తున్నామన్న అధికారులు తెలిపారు. ఎనీమియాతో బాధపడుతున్న వారిని కూడా గుర్తించి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నెలరోజుల వ్యవధిలో 7,86,226 మందికి సేవలందించామని వెల్లడించారు. హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న 1,78,387 మందిని, 1,25,948 మంది మధుమేహంతో బాధపడుతున్నారని గుర్తించినట్టు తెలిపారు. వీరికి వైద్యసాయం అందించినట్టు స్పష్టం చేశారు.

సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు ఇవే..

- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో క్రమం తప్పకుండా మందులు ఇవ్వడమే కాదు.. వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలన్నదానిపై సూచనలు కూడా ఇవ్వాలి.
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయడానికి తగిన స్థాయిలో సన్నద్ధం కావాలి.
- అవసరాలకు తగిన విధంగా 104 వాహనాలను సమకూర్చుకోవాలి.
- ఎక్కడా ఖాళీలు లేకుండా సిబ్బందిని భర్తీచేయాలి. ఆలోగా విలేజ్ క్లినిక్స్ నిర్మాణాలను పూర్తిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలి.
- ఉగాది కల్లా వీటిని పూర్తిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలి.
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలులో స్త్రీ శిశుసంక్షేమ శాఖను భాగస్వామ్యం చేయాలి.
- పిల్లలు, గర్భవతులు, బాలింతల్లో ఎనీమియాతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆ డేటాను స్త్రీ శిశుసంక్షేమశాఖకు బదిలీచేయాలి. డేటా ప్రకారం ఆయా లక్షణాలున్నవారికి పౌష్టికాహారం, మందులు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలి.
- గ్రామ సందర్శనలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ ఆ గ్రామంలో మంచానికి పరిమితమైన రోగులను తప్పనిసరిగా కలవాలి.
- వైద్య, ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలి.
- ఆరోగ్యశాఖలోని ఆశా వర్కర్ స్థాయి వరకూ కూడా ట్యాబులు లేదా సెల్‌ఫోన్లు ఇవ్వాలి.
- ఇందులో వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించి అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ సహా వివిధ కార్యక్రమాలకు సంబంధించిన యాప్‌లు ఉంచాలని ఆదేశించారు.
- ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కలిగించాలి. ఏ వ్యాధికి ఏ ఆసుపత్రిలో చికిత్స లభిస్తుందన్నది బాధితులకు తెలియాజేయాలి.
- ఎవరికైనా ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించాలంటే.. సంబంధిత చికిత్సను అందించే నెట్‌వర్క్ ఆసుపత్రి వివరాలు వెంటనే తెలిసేలా యాప్‌ను రూపొందించాలి. సంబంధిత ఆసుపత్రి లొకేషన్‌తో పాటు డైరెక్షన్ కూడా చూపేలా ఈ యాప్ ఉండాలి.
- ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు దగ్గర నుంచి కూడా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రి గురించి గైడ్ చేసే పరిస్థితి రావాలి.

ప్రజలకు కూడా ఈ యాప్ అందుబాటులో ఉండేలా చూడాలి. ఆరోగ్య శ్రీసాఫ్ట్‌వేర్ కూడా బాగా మెరుగుపరచాలి.

- ఎవరైనా తమకు వైద్యం కోసం ఎక్కడకు వెళ్లాలి? ఏ జబ్బుకు ఎక్కడ వైద్యం అందుతుంది? దీనికి ఆరోగ్య శ్రీ సేవలు ఎక్కడ అందుతాయి అన్నదానిపై లొకేషన్ సైతం తెలియజేసేలా యాప్‌లో వివరాలు ఉండాలి.
- అలాగే ఫ్యామిలీ డాక్టర్ సంబంధిత గ్రామానికి వెళ్లినప్పుడు కూడా రియల్‌టైం డేటా కూడా రికార్డు చేయాలి. దీనివల్ల సిబ్బంది మధ్య సమన్వయం, వివిధ విభాగాలు తీసుకునే చర్యల మధ్య కూడా సమన్వయం చక్కగా కుదురుతుంది.
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పర్యవేక్షణకు సమర్థయంత్రాంగం ఉండాలి. రాష్ట్రస్థాయిలో, అసెంబ్లీ స్థాయిలో, మండల స్థాయిలో అధికారులను ఉంచాలి. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటుచేయాలి. ఆరోగ్యరంగంలో ఎలాంటి ఫిర్యాదునైనా 104 ద్వారా స్వీకరించాలని, విలేజ్ క్లినిక్స్ సహా అన్నిచోట్లా ఈ నంబర్‌ను ఉంచాలని సీఎం జగన్ ఆదేశించారు.
- ఆరోగ్యశ్రీ సేవల విషయంలో ఏమైనా తప్పులు ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. సరిగ్గా సేవలు అందించకపోవడం, సేవల్లో నాణ్యత లేకపోవడం వంటి అంశాలపై కచ్చితంగా దృష్టిపెట్టాలి. నెగిటివ్ ఫీడ్‌బ్యాక్‌పై కచ్చితంగా పరిశీలన, చర్యలు ఉండాలి. డయాలసిస్ పేషెంట్లకు సేవలందించేందుకు 108 వాహనాలు వినియోగించుకోవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జీ ఎస్ నవీన్ కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జి నివాస్, ఆరోగ్యశ్రీ సీఈఓ ఎం ఎన్ హరీంద్రప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి మురళీధర్ రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ వి వినోద్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ (డ్రగ్స్) రవి శంకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'ఫ్రస్టేషన్‌తో చంద్రబాబు ఫ్యూజులు ఎగిరిపోయాయి'

తిరుపతి: చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌ను చూసి ప్రజలు ఇదేం ఖర్మరా బాబు అనుకుంటున్నారని మంత్రి రోజా ఎద్దేవా చేశారు.గురువారం ఆమె తిరుపతిలో జగనన్న క్రీడా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, రాయలసీమ ద్రోహి చంద్రబాబు.. ఫ్రస్టేషన్‌తో చంద్రబాబు ఫ్యూజులు ఎగిరిపోయాయన్నారు. చంద్రబాబు మెంటల్ బాలెన్స్ పడిపోయిందని ఆమె మండిపడ్డారు."ఎమ్మెల్యే అవడమే కష్టం అనుకుంటున్న వ్యక్తిని సీఎం చేయాలనుకోవడం నీ అజ్ఞానం. లోకేష్, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను చంపాలనుకుంటున్నారని సింపతీ డ్రామాలు ఆడుతున్నారు. తండ్రి లాంటి ఎన్టీఆర్‌ను చంపిన వ్యక్తి చంద్రబాబు" అంటూ మంత్రి రోజా దుయ్యబట్టారు.



## చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు: ఎంపీ విజయసాయిరెడ్డి

'జయహో బీసీ' పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



విజయవాడ: ఈ నెల 7న విజయవాడలో 'జయహో బీసీ..వెనుకబడిన కులాలే వెన్నెముక' పేరుతో మహాసభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, మార్గాని భరత్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎమ్మెల్సీలు కృష్ణమూర్తి, సునీత, రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. పదవుల్లో బీసీలకు ఎప్పుడూ లేనంత ప్రాధాన్యత దక్కిందన్నారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశం అనంతరం జోనల్ సమావేశాలు జరుగుతాయని, బీసీ నేతలంతా హాజరవుతారని ఆయన తెలిపారు."చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు. తన జీవితంలో మళ్లీ సీఎం అవ్వలేడు. ఆయన కేవలం తన కులం, తన కుటుంబం, తన మనుషుల కోసమే పనిచేశాడు. మూడు సార్లు సీఎం చేసిన ప్రజలను మోసం చేశాడు. 25 ఏళ్లు వైఎస్ జగన్ సీఎంగా ఉంటారు. పేదల కోసం సీఎం జగన్ పనిచేస్తున్నారు. లోకేష్ అవలక్షణాలున్న వ్యక్తి. అలాంటి లోకేష్ పాదయాత్ర కాదు.. పొర్లు దండాలు యాత్ర చేసిన ప్రజలు నమ్మరు. లోకేష్, చంద్రబాబులకు వచ్చే ఎన్నికల తర్వాత రాజకీయ భవిష్యత్ ఉండదు. 2024 తర్వాత టీడీపీ కూడా ఉండదు" అంటూ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు.

బీసీలను తలెత్తుకుని తిరిగేలా చేశారు: మంత్రి వేణుగోపాలకృష్ణ

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, బీసీలను దేశంలో ఏ ముఖ్యమంత్రి ఆదరించని విధంగా సీఎం జగన్ ఆదరించారన్నారు. బీసీలు తలెత్తుకుని తిరిగేలా చేశారన్నారు. "బీసీ రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ బిల్లు పెట్టింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ప్రతి బీసీ ఇంటికి సంక్షేమాన్ని సీఎం జగన్ చేర్చారు. జయహో బీసీ సభను చరిత్రలో ఎన్నడు జరగని విధంగా నిర్వహిస్తాం" అని మంత్రి అన్నారు.

## 7న జయహో..బీసీల సభ

విజయవాడ, డిసెంబర్ 1,డిసెంబర్ 7న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో "జయహో బీసీ మహా సభ" కు వైఎస్‌ఆర్‌సీపీ ఏర్పాట్లు ప్రారంభించింది.ఈ సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరు కానున్నారు. 84 వేల మంది బీసీ ప్రతినిధులను సభకు ఆహ్వానించారు. సభకు తరలి రావాలంటూ బీసీ వర్గాలకు ఫోన్లు చేసి ఆహ్వానించాలని,సభ జరిగేంత వరకు బీసీ వర్గాల ఫోన్లు మారుమోగించండని ఆయన పార్టీ శ్రేణులకు మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న "జయహో బీసీ మహా సభ" ఏర్పాట్లను పార్టీ సీనియర్ నేతలు, మంత్రులు పరిశీలిచారు. "జయహో బీసీ మహా సభ-వెనుకబడిన కులాలే వెన్నెముక.. అన్న నినాదంతో" బీసీ మహా సభ పోస్టర్ ను వారు విడుదల చేశారు. దాదాపు 84 వేల మందికి పైగా బీసీ ప్రజా ప్రతినిధులు హాజరయ్యే ఈ మహా సభను విజయవంతం చేయాలని వైఎస్సార్సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్‌ఆర్సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి కోరారు. గ్రామ స్థాయి నుంచి పార్లమెంటు వరకు ఆయా పదవుల్లో ఉన్న ప్రతి ఒక్క బీసీ ప్రజాప్రతినిధి తప్పనిసరిగా ఈ సభకు హాజరుకావాలని, ఒకవేళ ఎవరికైనా ఆహ్వానాలు అందకపోయినా, ఇదే ఆహ్వానంగా భావించి సభకు రావాలని విజయసాయిరెడ్డిగారు విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభకు గ్రామ పంచాయితీల్లోని వార్డు సభ్యుల నుంచి ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్న వారందరూ దాదాపు 84 వేల మంది బీసీ ప్రతినిధులు హాజరుకానున్నారని విజయసాయి రెడ్డి ప్రకటించారు. 7వ తేదీన ఉదయం 10 గంటలకు ఈ మహాసభ ప్రారంభం అవుతుంది. 12 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరై ప్రసంగిస్తారు. ఈ మూడున్నరేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం బీసీలకు ఏం చేసింది... రాబోయే కాలంలో ఏం చేయబోతుంది అనేది ముఖ్యమంత్రి వివరిస్తారు. అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ పదవులు పొందిన ప్రతి ఒక్క బీసీ ప్రతినిధులను ఈ సభకు ఆహ్వానిస్తున్నారు. బీసీ మహాసభ తర్వాత రీజనల్ స్థాయిలో జోనల్ సమావేశాలు కూడా నిర్వహిస్తారు. ఆ తర్వాత జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి సమావేశాలు, ప్రణాళిక బద్దంగా బీసీ సభలు నిర్వహించాలని నిర్ణయించారు జ్యోతిరావుపూలే జయంతి నాటికి సమావేశాలన్నింటినీ పూర్తి చేయాలని నిర్ణయించారు. సభకు ఆహ్వానిస్తూ బీసీ వర్గాలకు విర విగా ఫోన్లు చేయాలని బొత్స పార్టీ నేతకు సూచించారు. ఈ బాధ్యతను ప్రత్యేకంగా ఒకరికి అప్పగించి ,వారికి ఫోన్ నెంబర్లు ఇచ్చి, ఫోన్లు చేసి ఆహ్వానించటమే పనిగా చేయాలన్నారు . పదవులు పొందిన బీసీలకు అధికారాలు లేవన్న విమర్శలు హాస్యాస్పదమని బోత్స అన్నారు. ప్రతి ఒక్క బడుగు బలహీన వర్గాల వారికి మేమున్నాం అనే ధైర్యాన్ని, భరోసాను ఇవ్వడమే మా పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. బీసీ మహాసభ తర్వాత ఎస్సీ, ఎస్టీల సభలు కూడా నిర్వహిస్తామని వెల్లడించారు.

## సుప్రీం చరిత్రలో మూడోసారి.. మహిళా ధర్మాసనం

దిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానంలో మరో అరుదైన ఘట్టం.. సుప్రీం కోర్టు చరిత్రలో మూడోసారి మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటైంది.జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బేలా ఎం. త్రివేదితో కూడిన ధర్మాసనాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం ఏర్పాటు చేశారు. ఈ మహిళా బెంచ్ గురువారం పలు కేసులను విచారించనుంది. ఇందులో వైవాహిక గొడవలకు సంబంధించి 10 బదిలీ పిటిషన్లు, మరో 10 బెయిల్ పిటిషన్లు ఉన్నాయి.కాగా.. ఇలా పూర్తిగా మహిళా న్యాయమూర్తులతో సుప్రీంకోర్టులో ధర్మాసనం ఏర్పాటవడం చరిత్రలో ఇది కేవలం మూడోసారి మాత్రమే. తొలిసారి 2013లో జస్టిస్ జ్ఞాన సుధా మిశ్ర, జస్టిస్ రంజనా ప్రసాద్ దేశాయ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏర్పాటై పలు కేసుల విచారణలు చేపట్టింది. నిజానికి అది యాదృచ్ఛికంగా జరిగిందే. అప్పటి ప్రిసైడింగ్ జడ్జీ జస్టిస్ ఆఫ్తాబ్ ఆలమ్ గైర్హాజరుతో మహిళా ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత.. 2018లో జస్టిస్ ఆర్. భానుమతి, జస్టిస్ ఇందిరా బెనర్జీతో కూడిన మహిళా ధర్మాసనం ఏర్పాటైంది.ప్రస్తుతం సుప్రీంకోర్టులో 27 మంది న్యాయమూర్తులు ఉండగా.. వీరిలో ముగ్గురు మహిళా జడ్జీలు ఉన్నారు. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ బేలా త్రివేది గతేడాది ఆగస్టు 31న ఒకేరోజు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరు ప్రమాణం చేసే నాటికి జస్టిస్ ఇందిరా బెనర్జీ కూడా సుప్రీంకోర్టు జడ్జీగా ఉన్నారు. సుప్రీంకోర్టులో అత్యధికంగా నలుగురు మహిళా న్యాయమూర్తులు ఉన్నది అప్పుడే. ఈ ఏడాది అక్టోబరులో జస్టిస్ ఇందిరా బెనర్జీ పదవీ విరమణ చేశారు.ఇక జస్టిస్ బి.వి. నాగరత్న.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రేసులో ఉన్నారు. 2027లో ఆమె 36 రోజుల పాటు సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశముంది. అదే జరిగితే.. సుప్రీంకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె అపూర్వ ఘనత సాధిస్తారు. కాగా.. 2020లో మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ అమరేశ్వర్ ప్రతాప్ తొలిసారి ముగ్గురు మహిళా న్యాయమూర్తులతో పూర్తిస్థాయి బెంచ్ ఏర్పాటు చేశారు

## సీఎం జగన్‌ను కలిసిన సీఎస్ జవహర్‌రెడ్డి

తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం సీఎం జగన్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.సమీర్ శర్మ పదవీ విరమణ నేపథ్యంలో కొత్త సీఎస్‌గా జవహర్‌రెడ్డిని నియమిస్తూ ఏపీ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త ప్రధాన కార్యదర్శిగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1990 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి జవహర్‌రెడ్డి.. సీఎంకు ప్రత్యేక కార్యదర్శిగా పని చేశారు.



# సంపాదకీయం

శుక్రవారం 02-12-2022

## మళ్లీ కమలంతో పీకే దోస్తి

ప్రశాంత్ కిశోర్.. పీకే పేరు విని చాలరోజులు, కాదు నెలలు అయింది కదూ.. అవును, ఒకప్పుడు దేశ రాజకేయాల్లో ప్రముఖంగా వినిపించిన ఎన్నికల వ్యూహకర్త పీకే అని పిలవబడే ప్రశాంత్ కిశోర్, ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడా వినిపించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో, అధికార పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా సేవలు అందిస్తున్న పీకే ఊసే లేదు. ఒకప్పుడు పీకే ను భుజానికి ఎత్తుకుని, ఆయనతో తనకు ఎనిమిదేళ్ళకు పైగా చాలా 'క్లోజ్ రిలేషన్స్' ఉన్నాయని చెప్పుకొచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కానీ, ఆయన్నే నమ్ముకుని రెండవసారి అధికారంపై ఆశలు పెంచుకున్న ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కానీ, ఇప్పుడు పీకే పేరే తలచుకోవడం లేదు. అదలా ఉంటే, తెలుగు రాష్ట్రాలలోనే కాదు, ఒక్క ఆయన స్వరాష్ట్రం బీహార్ లో మినహా మరెక్కడా ఆయన పేరు అంతగా ప్రస్తావనకు రావడం లేదు. అయితే, ఈ సంవత్సరం (2022) ప్రారంభంలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలలో, తృణమూల్ కాంగ్రెస్ విజయం తర్వాత పీకే ప్రతిష్ట పతాక స్థాయికి చేరింది. అయితే, అదే సమయంలో పీకే రాజకీయ వ్యూహకర్త వేషం చాలిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, ప్రత్యక్ష రాజకీయాల విషయంలోనూ అంతగా ఆసక్తి లేదని, చెప్పుకొచ్చారు. కానీ, ఆ తర్వాత, జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేసేందుకు చాలా చాలా ప్రయత్నాలు చేశారు. ఒక దశలో కాంగ్రెస్ పార్టీ పునర్జీవనానికి నడుం బిగించారు. 'వ్యూహ' రచన చేశారు. చివరకు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు కుడా పీకే సిద్ధమయ్యారు. అయితే, కారాణాలు ఏవైనా, ఆ రెండు ప్రయత్నాలు విఫల మయ్యాయి. ఆ తర్వాతనే, పీకే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తో చేతులు కలిపారు. తెలంగాణలో తెరాసను మూడవసారి గెలిపించడంతో పాటుగా, జాతీయ స్థాయిలో కేసీఆర్ కు పొలిటికల్ స్పేస్ క్రియేట్ చేసేందుకు డీల్ కుదుర్చుకున్నారు. అయితే, ఎందుకనో గానీ,కొద్ది నెలలుగా పీకే పేరు తెలంగాణలో వినిపించడం వినిపించడం లేదు. అలాగే, ఎపీలోనూ పీకే .ఐ ప్యాక్ టీం పనిచేస్తున్నా పీకే మాత్రం దూరంగానే ఉంటున్నారు. ప్రస్తుతం పీకే, బీహార్ రాజకీయాలలో ప్రత్యక్ష భూమిక కోసం పావులు కదుపుతున్నారు. బీజేపీతో తెగతెంపులు చేసుకుని పాత మిత్రుడు లాలూ ప్రసాద్ యాదవ్, ఆర్జేడీతో జట్టు కట్టిన, ముఖ్యమంత్రి, జేడీ(యు) లీడర్ నితీష్ కుమార్ ఓడించడమే లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్నారు, ప్రత్యక్ష రాజకీయాల్లో ఎంట్రీకి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. అయితే, ఇక్కడ ఆసక్తికర విషయం ఏమంటే, పీకే భూమి గుండ్రంగా ఉంటుందని మరోమారు నిరూపించారు. ఆయన ఎక్కడి నుంచి రాజకీయంగా తొలి అడుగు వేశారో, మళ్ళీ అక్కడికే వచ్చినట్లు తెలుస్తోంది. బీహారులో లాలూ ? నితీష్ జోడీని ఓడించేందుకు బీజేపీతో జట్టు కట్టేందుకు సిద్ధమైనట్లు బీహార్ రాజకీయ వర్గాలలో బలంగా వినిపిస్తోంది. ఆ దిశగానే అడుగులు వేస్తున్నారని అంటున్నారు. అందుకే.. వైసీపీ, టీఆర్ఎస్ లను వదిలేశారని అనుమానిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ ను మంచి ఎన్నికల వ్యూహకర్త అనాలా, మంచి పొలిటికల్ బిజినెస్ మాన్ అనాలా? అంటే, రాజకీయ విశ్లేషకులు పీకే, ఓ మంచి బిజినెస్ మాన్ అనే అంటున్నారు. రాజకీయ పార్టీల బలహీనతలను సొమ్ము చేసుకున్నారని, అంటున్నారు. అలాగే, పీకే ఖాతాలో చేరిన ఎన్నికల విజయాలు నిజంగా ఆయన వ్యూహబలంతో సాధించిన విజయాలేనా,అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా గెలిచే పార్టీలతో అయన డీల్ కుదుర్చుకున్నారే గానీ, ఆయన వ్యూహాల కారణంగానే ఏ పార్టీ గెలిచింది లేదనీ కొందరు రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.ప్రశాంత్ కిశోర్ తొలి సారిగా, 2012లో గుజరాత్ ఎన్నికల్లో అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రధాని నరేద్ర మోడీ గెలుపు కోసం పని చేశారు. నిజానికి అప్పటికి, ఆయన పూర్తి స్థాయి ఎన్నికల వ్యూహకర్తగా స్థిరపడలేదు.అలాగే,అప్పటికే రెండుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా దేశంలోనే కాదు, అంతర్జాతీయంగానూ నరేంద్ర మోడీకి ప్రత్యేక గుర్తింపు వుంది. మేథావి వర్గాల్లో గుజరాత్ మోడల్' పరిపాలన గురించి చర్చ అప్పటికే మొదలైంది. ముఖ్యంగా విదేశాల్లో ఉన్నఎన్నారైలు, అనేక మంది 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ గెలుపుకోసం వచ్చిన అనేక మంది ఎన్నారైలలో ప్రశాంత్ కిశోర్ ఒకరు. గుజరాత్, హెల్త్ మోడల్ ను విశ్లేషిస్తూ ఒక ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసం,ఆయన్ని మోడీ దగ్గరకు చేర్చింది. ఆ ఎన్నికలో పీకే, మోడీ గెలుపు కోసం పనిచేశారు. అయితే, 2012 ఎన్నికలలో మోడీ సాధించిన హట్రిక్ విజయం పూర్తిగా పీకే ఖాతాలో వేసుకున్నా, అది నిజం కాదు. మోడీతో పరిచయం ఏర్పడిన తర్వాతనే,2012లో సిటిజెన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్ (సిఎజి) అనే ఎన్నికల ప్రచార బృందం ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత 2014 సార్వత్రిక ఎన్నికల్లో సిఎజి బీజేపీ పక్షాన పనిచేసింది.ఆ విధంగా పీకే 2013 మేలో, కిషోర్ సిటిజెన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్ (సిఎజి) ను స్థాపించారు. కిషోర్ మోడీతో విడిపోయాక, (సిఎజి) ను స్పెషలిస్ట్ పాలసీ సంస్థ ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-పిఎసి) గా మార్చారు. ఇక ఆతర్వాత ఏమి జరిగింది అన్నది తెలిసిందే.

# టూర్లకు వేళాయెరా...



విజయవాడ డిసెంబర్ 1, ఏపీలో పొలిటికల్ ఫైట్ హాట్ హాట్‌గా నడుస్తోంది. వైసీపీ వర్సెస్ టీడీపీ పోరు తీవ్ర స్థాయిలో నడుస్తోంది. జగన్ వర్సెస్ చంద్రబాబు వార్ నువ్వా-నేనా అన్నట్లు సాగుతుంది. నెక్స్ట్ ఎన్నికల్లో ఇద్దరు నాయకులు అధికారం కోసం ఇప్పటినుంచే పదునైన వ్యూహాలు, ప్రత్యర్థులపై పై చేయి సాధించడం, పార్టీని బలోపేతం చేసుకోవడం, ప్రజల మద్దతు పెంచుకోవడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు.షెడ్యూల్ ప్రకారం ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది. కానీ ముందస్తు ఎన్నికలు వచ్చే ఛాన్స్ కూడా ఉంది. దీంతో అటు జగన్, ఇటు చంద్రబాబు జనంలోకి వెళ్లిపోతున్నారు. ఎవరికి వారు సెపరేట్ కార్యక్రమాలు చేస్తున్నారు. ఓ వైపు అసెంబ్లీ స్థానాల్లో బలమైన అభ్యర్థులని నిలబెట్టేలా ప్లాన్ చేసుకుంటూ, మరో వైపు నేతలని ప్రజల్లో తిప్పుతున్నారు. గడపగడపకు అని వైసీపీ, బడుదేబాదుడు, ఇదేం ఖర్మ అంటూ టీడీపీ నేతలు ఇంటింటికి తిరుగుతున్నారు. ఇక చంద్రబాబు, జగన్‌లు సైతం టూర్లు వేస్తున్నారు.గ్యాప్ లేకుండా బిజిబిజిగా గడుపుతూ ప్రజా మద్దతు పెంచుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పథకాల ప్రారంభం, అభివృద్ధి కార్యక్రమాల శంఖుస్థాపనల పేర్లతో జగన్ భారీ సభలతో ప్రజల్లో ఉంటున్నారు. ఇటీవల పలు జిల్లాల్లో పర్యటించారు. ఈ మధ్య పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించారు..ఇంకా చిత్తూరు, కడప జిల్లాల్లో పర్యటించనున్నారు. జగన్ రాక సందర్భంగా వైసీపీ శ్రేణులు జనాలని సమీకరించి..భారీ సభలు ఏర్పాటు చేస్తున్నారు.అటు చంద్రబాబు సైతం బాదుడేబాదుడు, ఇదేం ఖర్మ కార్యక్రమాలతో రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు. ఆ మధ్య గుంటూరు, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో పర్యటించారు..ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రృటిస్తున్నారు. తర్వాత విజయనగరం, కృష్ణా జిల్లాల్లో టూర్ ప్లాన్ చేస్తున్నారు. ఇక బాబు రోడ్ షోలు, సభలకు భారీ స్థాయిలో జనం వస్తున్నారు. అంటే జగన్‌కు, బాబుకు జన స్పందన భారీగా ఉంది. అటు పవన్‌కు భారీ మద్దతు వస్తుంది. మరి చివరికి ప్రజలు ఎవరి వైపు ఉండి సక్సెస్ చేస్తారో చూడాలి.

# జనవరి 2వ తేదీ శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి



తిరుమల జనవరి 2 వ తేది శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి నిర్వహిస్తున్నామని టీటీడీ బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బా రెడ్డి అన్నారు. ఈ సారి కూడా గతంలో లాగా పదిరోజుల పాటు భక్తులకు వైకుంఠద్వార దర్శనం వుంటుంది. జనవరి 2 న రాజ్యాంగ హోదాలో విఐపీలు స్వయంగా వస్తే మాత్రమే బ్రేక్ దర్శనం వుంటుంది. జనవరి 2 నుండి 11 వ తేదీ వరకు రోజుకు 50 వేల చొప్పున 5 లక్షల సర్వదర్శనం టోకన్లు కేటాయింపు వుంటుంది. జనవరి 1వ తేదీ సర్వదర్శనం టోకన్లు కౌంటర్ ప్రారంభం అవుతాయి. టోకన్లు పూర్తయ్యేదాకా తిరుపతిలో కౌంటర్లు తెరచివుంటాయి. వైకుంఠద్వారా దర్శనానికి సంభందించి రోజుకు 25 వేల చొప్పున 2.5 లక్షల రూ 300 దర్శనం టిక్కెట్లు ఆన్లైన్ లో కేటాయింపు జరుగుతుంది. ఆనందనిలయం బంగారు తాపడం పనులకు గానూ ఫిబ్రవరి 23 వ తేదీన బాలాలయం నిర్వహించాలని ముహూర్తం ఖరారు చేసాం. శ్రీవారి మూలవిరాట్టుకు నిత్య సేవలు నిర్వహణ....భక్తుల దర్శనం యధావిధిగా కొనసాగుతుంది. 1957, 1958 సంవత్సరంలో జరిగినట్టే బంగారు తాపడం పనులు చేస్తాం. భక్తులు హుండీలో సమర్పించిన స్వర్ణ కానుకలతో....ఆనందనిలయానికి బంగారు తాపడం చేయాలని నిర్ణయించాం. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ప్రస్తుతం 331 ఆలయాలు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 1100 పైగా ఆలయాలను త్వరితగతిన నిర్మాణాలు చేయాలని నిర్ణయించాం. రెండవ ఘాట్ రోడ్డులో రక్షణ గోడలు నిర్మాణానికి 9 కోట్లు నిధులు మంజూరు చేసాం. తిరుమలలో స్థానికులు నివసిస్తున్న బాలాజీ నగర్ లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ 3.70 కోట్లు నిధులు మంజూరు అయింది. జమ్మూ కాశ్మీర్ లో నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయం వద్ద సదుపాయాలు ఏర్పాటుకు రూ 7 కోట్లు కేటాయించాం. టీటీడీ ఆసుపత్రుల్లో ఔషదాలు, సర్జికల్ పరికరాలు కొనుగోలుకు రూ 2.86 కోట్లు, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి 3.75 కోట్లు నిధులు మంజూరు, టీటీడీ పర్మనెంట్ ఒ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎప్పటిలాగా బ్రహ్మోత్సవ బహుమానం అందజేయాలని నిర్ణయించామని అన్నారు.

# ఉవ్వెత్తున ఎగసిన కాలుష్య బాధిత గ్రామం

**గ్రామాలు మండలాలు జిల్లాలు రాష్ట్రాలు దాటుకొని కేంద్రానికి చేరిన గ్రామ సమస్య ఏకతాటిపై నడుం బిగించిన గ్రామస్తులు నిరసన బాటకు సిద్ధమైన గ్రామ యువత**

జగ్గయ్యపేట షేర్ మొహమ్మద్ పేట గ్రామంలో గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రధాన సమస్యగా గ్రీన్ టెక్ కర్మాగారం మారింది సుమారు 480 మంది విద్యార్థులు చదువుకునేటువంటి ప్రభుత్వ పాఠశాలకు అతి సమీపంలో కొద్ది సంవత్సరాల క్రితం కర్మాగారాన్ని ఏర్పాటు చేశారని ఒకపక్క గ్రామస్తులు మరోపక్క పరిసర ప్రాంత రైతులు విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు అని దీనిని ఉపేక్షించేది లేదని గ్రామంలోని అఖిలపక్ష పార్టీలు నడుంబిగించాయి. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన ఉద్యోగులు, విద్యార్థులు యువత అంతా ఒక తాటిపైకి చేరుకొని ఉద్యమించడానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు గ్రామాన్ని సందర్శించనున్న కేంద్ర బృందం గ్రామానికి వస్తుందా లేదా అనే ప్రశ్నకు మరో రెండు రోజుల్లో సమాధానం దొరకనుంది. గడిచిన కొద్ది సంవత్సరాల లో గ్రామంలో రకరకాల ఆరోగ్య సమస్యలతో ప్రజల ఇబ్బందులు పడుతున్న విషయం సామాజిక మాధ్యమాలలో సోషల్ మీడియాలో చూసి స్పందించిన పరిసర ప్రాంత ప్రజలు షేర్ మహమ్మద్ పేట సమస్యపై తమ వంతు పోరాటానికి సిద్ధమవుతున్నారు. గ్రీన్ టెక్ కర్మాగారాన్ని అక్కడినుండి తీసివేసే వరకు ఉద్యమిస్తామని అఖిలపక్ష నేతలు తెలియజేస్తున్నారు. గ్రామంలోని సిపిఎం పార్టీ నేతలు సిఐటియు నేతలు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు డివైఎఫ్ఐ నేతలు ఆది నుండి పోరాటం సాగిస్తూనే ఉండటం దానికి తోడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు గ్రామ నేతలు విద్యార్థులను పరామర్శించడం సమస్యలపై ఉద్యమించడం జరుగుతూనే ఉంది. ఇప్పటికే స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను కర్మాగారాన్ని అక్కడే ఉండి పూర్తిగా తొలగిస్తానని ప్రజలకు సామాజిక మాధ్యమాల ద్వారా మాట ఇచ్చి ఉన్నారు. ఈ కోణంలో రాబోయే వారంలో గ్రామంలో తీవ్ర మార్పులు జరగనున్నాయా! ఇచ్చిన మాట ప్రకారం స్థానిక శాసనసభ్యులు కర్మాగారాన్ని తొలగిస్తారా?కేంద్ర బృందం వారం రోజుల క్రితం తీసుకువెళ్లిన శాంపిల్స్ రిపోర్ట్ బట్టబయలు చేస్తారా? వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామానికి రానున్నారా? ఆ గ్రామ ప్రజలకు శాపంగా మారిన కాలుష్య కారకమైన ప్రధాన కర్మాగారం అక్కడ నుండి తీసివేస్తారా? అసలు ఊరినే ఖాళీ చేయించి వేరొక ప్రాంతంలో స్థలాలు కేటాయించి ప్రభుత్వ పాఠశాలను కూడా కర్మాగార సమీపం నుండి మారుస్తారా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం కోసం మరి కొద్ది రోజులు వేచి చూడాల్సిందేనా!

## సంచులు లేవంటూ రైతు భరోసా కేంద్రానికి తాళం వేసిన రైతులు

గోకవరం తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేట సచివాలయం ఆవరణలో రైతులు సంచులు లేవంటూ రైతులు సచివాలయం నికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. సచివాలయం ఎదుట నిరసన తెలియజేస్తూ వెంటనే సంచులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు గోన సంచల సకాలంలో అందించడం లేదు. సచివాలయంలో ఒక మార్చిరి రైస్ మిల్లు దగ్గర తేమశాతం మరో విధంగా వస్తుందని రైతులు వాపోతున్నారు. ధాన్యం తీసుకెళ్లాక రైతులను రైస్ మిల్లర్స్ ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా రిపోర్టర్నే తిరస్కరిస్తే ఇక మమ్మల్ని ఆదుకునే వాళ్ళు ఎవరన్నారు. కష్టపడి వాహనాల్లో తరలించిన ధాన్యం నష్టానికి ఇచ్చుకోవాల్సి వస్తుందని బాధపడుతున్నారు. తిరిగి చార్జీలు కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రభుత్వాన్ని రైతులను నిలదీస్తున్నారు.కేవలం టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేస్తే ఊరు పేరు మాత్రమే తీసుకుంటున్నారని రైతు సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. అధికారులు సమాధానం ఇవ్వకపోతే పెద్ద ఎత్తున విజృం ఇస్తామని రైతులు ప్రభుత్వానికి హెచ్చరించారు.

## స్కాం కి మొత్తం సూత్రధారి అశోక్ లీలాండే జేసీ ప్రభాకర్ రెడ్డి



అనంతపురంఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ డీ అటాచ్ మెంట్ పై జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు.ఈ డీ అనేది పెద్ద సంస్థ ఈ కేసు గురించి నేను మాట్లాడకూడదు. నిన్న ఈ డీ రిలీజ్ చేసిన ప్రెస్ నోట్ చూసి చాలా ఆనందంగా ఉంది. ముందు నుంచి నేను పోలీసులు, అధికారులను అడిగినా అశోక్ లైలండ్ ను కేసు లో పెట్టలేదు. మొత్తం స్కాం రూ. 38.36 కోట్లు అని ఈ డీ ప్రెస్ నోట్ లో రాసింది. సుమారు రూ. 33 కోట్ల వరకు వైట్ మనీ అశోక్ లీలాండ్ కంపెనీకి, టాక్స్ లకి కట్టాం. కేసు లో అశోక్ లీలాండ్ పాత్ర పై విచారిస్తాం అని ఈ డీ ప్రెస్ నోట్ లో పేర్కొంది. స్కాం కి మొత్తం సూత్రధారి అశోక్ లీలాండే. ఈ కేసు లో అశోక్ లీలాండ్ తో పాటు ఆర్టీఏ అధికారులు, నాగాలాండ్ అధికారులు ఉన్నారు. ఇటీవలే హైకోర్టు ఆదేశాల తో అన్ని వాహనాలను రిలీజ్ చేశారని వివరణ ఇచ్చారు.

## చైతన్య భారతి కాలేజీలో ఎయిడ్స్ అవగాహన సదస్సు

ఏలూరు ప్రపంచ హెచ్ఐవి /ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏలూరు జిల్లా చింతలపూడి లోని చైతన్య భారతి జూనియర్ కళాశాల లో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవి, ఎయిడ్స్ రోగాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అని అన్నారు. విద్యార్థులు భారత రాజ్యాంగంలోని హక్కులు

విధులు గురించి అవగాహన కలిగి ఉండాలని అని అన్నారు. చింతలపూడి ఏరియా హాస్పిటల్ ఎయిడ్స్ కౌన్సిలర్ నిమ్మగడ్డ. అశోక్ మాట్లాడుతూ ఏయిడ్స్ రావడానికి కారణం ముఖ్యంగా అక్రమ సంబంధాలే నని కేవలం ఎయిడ్స్ రోగం పట్ల అవగాహన లేక ఎంతో మంది బలవుతున్నారు అని, సమాజంలో ఎయిడ్స్ బాధితులను చులకనగా చూడరాదని అలా ఎవరైనా బాధితుల పై వివక్ష చూపితే శిక్ష కు అర్హులని, పిల్లలు ప్రేమలు, పెళ్ళిళ్ళు అని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, చదువులో శ్రద్ధ పెట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అని అన్నారు. ఈ కార్యక్రమము లో స్కూల్ చైర్మన్ బొడా. రవి, కాలేజ్ ప్రిన్సిపాల్ ఉ. ప్రసన్న కుమార్, న్యాయవాదులు మిసాల.రమేష్, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏబీ వెంకటేశ్వరరావుకు షాక్



విజయవాడ, డిసెంబర్ 1, ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాక్ ఇచ్చింది. సస్పెన్షన్ కాలానికి జీత భత్యాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ప్రభుత్వం చెల్లించలేదంటూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మపై వెంకటేశ్వర రావు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ ను ధర్మాసనం కొట్టి వేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారం చివర దశకు చేరుకోవడం వల్ల సీఎస్ చర్యలను ఉద్దేశ పూరక ఉల్లంఘనగా పరిగణించడం సాధ్యం కాదని వివరించింది. అంతే కాకుండా తర్వాతి కాలంలో సీఎస్ చర్యలు ఉద్దేశ పూర్వక ఉల్లంఘనలా అనిపిస్తే మరోసారి పిటిషన్ దాఖలు చేసేందుకు ఈ తీర్పు అడ్డంకి కాదని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. ఏబీ వెంకటేశ్వర రావు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ పై జస్టిస్ సోమయాజులు ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. ఏబీ తరఫున సీనియర్ న్యాయవాది బి. ఆదినారాయణ రావు వాదనలు వినిపించారు. అయితే పిటిషన కొట్టివేసి... జీత భత్యాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు కూడా సస్పెన్షన్ ను ఎత్తి వేసిందని అన్నారు. అయితే సస్పెన్షన్ కాలానికి జీత భత్యాలు చెల్లించమని ధర్మాసనం చెప్పినా చెల్లించలేదని, ఇది కోర్టు ఆదేశాల ఉల్లంఘనే అని వివరించారు. అయితే విచారణ ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగికి జీతభత్యాలు చెల్లించాలా లేదా అన్నిది ప్రభుత్వ విచక్షణ అని చెప్పారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, ప్రభుత్వం మధ్య ఎప్పటి నుంచో ఘర్షణ నడుస్తోంది. నిఘా విభాగం చీఫ్ గా పని చేసిన సమయంలో భద్రత పరికరాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆయనపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ కేసులో విచారణను ఎదుర్కొంటున్న ఆయన సాక్ష్యుల్ని ప్రభావితం చేసేందుకు యత్నించారన్న అభియోగంపై సస్పెండ్ చేసింది. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏబీ వెంకటేశ్వర రావుపై తీవ్ర అవినీతి అభియోగాలు ఉన్నాయని, ఇప్పటికే ఆయన్ని సర్వీసు నుంచి డిస్మిస్ చేయడానికి సిఫార్సు చేశామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అఖిల భారత సర్వీసు అధికారులపై ఉండే క్రిమినల్ అభియోగాలన్నీ తొలగిపోయేంత వరకు లేదా కొట్టేసేంత వరకు వారిసి సస్పెన్షన్ విధించే విచక్షణాధికారం ఏపీ ప్రభుత్వానికి ఉందని అందులో వివరించారు. ఈ మేరకు అఖిల భారత సర్వీసు నియమావళి ప్రకారం.. ఏబీ వెంకేటశ్వర రా?ను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ గా పోస్టింగ్ ఇచ్చామని, ఆ తర్వాత ఆయన తాను ఎదుర్కొంటున్న నేర విచారణకు సంబంధించిన వ్యవహారంలో సాక్ష్యుల్ని ప్రభావితం చేసందుకు ప్రయత్నించినట్లు గుర్తించామన్నారు, ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని,, సస్పెన్షన్ అమల్లో ఉన్న కాలంలో ఆయన, విజయవాడను విడిచి పెట్టి వెళ్లడానికి వీళ్లేదని ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి వెంకటేశ్వరరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయనకు సస్పెన్షన్ ముగిసినట్టేనని.. జీతభత్యాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం దిగొచ్చి పోస్టింగ్ ఇచ్చింది. జూన్ 14నే ప్రభుత్వం ఏపీ ప్రింటింగ్, స్టేషనరీ అండ్ స్టోర్స్ డిపార్ట్‌మెంట్‌కు కమిషనర్‌గా ఏబీని నియమించింది. మే 19వ తేదీ నుంచి ఆయన్ను విధుల్లోకి తీసుకున్నామని సీఎస్ సమీర్ శర్మ అబ్‌స్ట్రాక్ట్ ఇచ్చారు.

# నేడు ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం



కంప్యూటర్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాల గురించి అవగాహన పెంచడం ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దిల్లీకి చెందిన రాజేంద్ర ఎస్.పవార్, విజయ్ కె.తదని లు ఐఐటి ఢిల్లీ లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1981 లోనే రానున్న కాలంలో కంప్యూటర్లే ప్రపంచాన్ని శాసిస్తాయనే విషయాన్ని గుర్తించి...కంప్యూటర్ వినియోగం నేర్పించేందుకు ఎన్ఐఐటి (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) అనే సంస్థను నెలకొల్పారు. 1981 డిసెంబర్ 2న డిల్లీలోనే మొదటి శాఖను ప్రారంభించారు. దీని ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ నివ్వటం ప్రారంభించారు. 2000 నాటికి ప్రపంచంలోని 40 దేశాల్లో రెండు వేల శాఖలు విస్తరించారు. 2001లో ఎన్ఐఐటి తన 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో 2001 డిసెంబరు 2న ఒకే రోజు ప్రపంచ వ్యాప్తంగా లక్ష మందికి కంప్యూటర్ శిక్షణనిచ్చారు. అదే రోజును ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవంగా ప్రపంచం గుర్తించింది.

ఇతర అంశాలు: దేశంలో 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాదించిన తొలి గ్రామం – చామ్రవట్టం (కేరళ). భారత దేశంలో కంప్యూటర్ అక్షరాస్యత కేవలం 6.5%. అందరికి కంప్యూటర్ విద్య అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2002లో ప్రభుత్వ బడుల్లో కంప్యూటర్ శిక్షణను ప్రవేశ పెట్టింది. 2008 నుంచి కంప్యూటర్ విద్యను ఎన్ఐఐటి ద్వారా పూర్తిగా ఆధునీకరించింది.

# అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం



తిరుపతి, డిసెంబర్ 1, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎర్రచందనం అక్రమ చేసే స్మగ్లర్స్ ను పట్టుకునేందుకు పోలీసులు చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా వడమాలపేట టోల్ ప్లాజా సమీపంలో తమిళనాడు నుంచి ఎర్రచందనం కూలీల వస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. సినిమా సీన్ ను తలపించేలా ఓ రేంజ్‌లో ఛేజ్ చేసి మరి 44 ఎర్రచందన కూలీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 81 ఎర్రచందనం దుంగలను, రెండు లారీలను, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వడమాల పేట మండలం, టోల్ ప్లాజా సమీపంలోని తిరుపతి – చెన్నై జాతీయ రహదారి లో గల శివ శక్తి దాబా వద్ద మంగళవారం సాయంత్రం భారీ స్థాయిలో తనిఖీలు చేపట్టామన్నారు. అయితే మారుతీ సుజుకి స్విఫ్ట్ వాహనాన్ని ఫైలైట్ వాహనంగా ముందు వస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే వచ్చిన ఎౡ97-9837 ఐచర్ లారీ, అశోక్ లేలాండ్ ఎౡ 52ఆ0988 రావడంతో వాహనాలను వెంబడించారని తెలిపారు. అనుమానం వచ్చిన లారీ డ్రైవర్లు దిశను మర్చి తిరుపతి వైపు వెళ్ళే ప్రయత్నం చేశారని, ముందుగా ఏర్పాటు చేసిన బారికేడ్స్, రెండు అదనపు పార్టీల సహాయంతో పుష్ప సినిమాను తలపించేల చేసింగ్ చేసి పట్టుకున్నట్లు వివరించారు. ప్రధాన మేస్త్రి అయినా సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నామని, మరో ప్రధాన మేస్త్రి స్వామి నాథన్ ను అదుపులోకి తీసుకోని కింగ్ పిన్స్ ను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ స్పష్టం చేసారు. ఈ సినిమాటిక్ ఛేజింగ్ లో ఇద్దరు డ్రైవర్లను, 42 మంది కూలీలతో పాటుగా, 2 కోట్లు విలువ గల 2632.4 కేజీల బరువుగల 81 ఎర్ర చందనం దుంగలను, 11 గొడ్డళ్లు, 32 రంపాలు, అశోక్ లైలాన్ లారీ, స్విఫ్ట్ కారు, ఐచర్ లారీ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంత భారీ స్థాయిలో ఎర్ర చందనం కూలీలను పట్టుకొని, దుంగలను స్వాధీన పరుచుకోవడంలో ప్రతిభ కనబరచిన పుత్తూరు ౡఆఖా రామరాజు, భాకరాపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ ఓ. తులసిరాం, పుత్తూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ ఓ. సురేశ్ కుమార్, వడమలపేట పోలీస్ స్టేషన్ ౡఎ ఇ. రామాంజనేయులు, నారాయణవనం పోలీస్ స్టేషన్ ౡఎ ఓ. పరమేష్ నాయక్, ఐఎః పురం పోలీస్ స్టేషన్ ౡఎ ఖ. సునీల్, పుత్తూరు అర్బన్ పోలీస్ స్టేషన్ ౡఎ, ఖ. వెంకట మోహన్, తిరుపతి ౦ఖీ 4 వ బెటాలియన్ ఖీౡఎ సుబ్బరాజు లను తిరుపతి ఎస్పీ అభినందించారు. వారికి తగిన రికార్డులు ప్రకటించారు.

# సెపరేట్ గా అయిపోయిన ఫ్యామిలీ...

విజయవాడ, డిసెంబర్ 1, రాజకీయాలు ఎప్పుడు ఎలా మారతాయో ఊహించలేము..ఫ్యామిలీలు సైతం రాజకీయాలు వల్ల సెపరేట్ అయిపోతాయి. రాజకీయాలకు అంత పవర్ ఉందని చెప్పవచ్చు. అయితే ఇప్పుడు వైఎస్సార్ ఫ్యామిలీ పరిస్తితి కూడా అలాగే ఉంది. వైఎస్సార్ చనిపోయాక కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి జగన్ వైసీపీ పెట్టారు. ఆ పార్టీ పెట్టి అనేక ఒడిదుడుకులు ఎదురుకుని చివరికి సక్సెస్ అయ్యి సీఎం అయ్యారు. అయితే జగన్ సక్సెస్‌లో తన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల పాత్ర కూడా ఉంది. జగన్ జైలుకు వెళ్లినప్పుడు వారిద్దరే పార్టీని నడిపించారు. ఉపఎన్నికల్లో పార్టీని గెలిపించారు. ఇక అన్న పార్టీ కోసం షర్మిల పాదయాత్ర కూడా చేశారు. అలాగే 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం షర్మిల, విజయమ్మలు కష్టపడ్డారు. జగన్ గెలిచి అధికారంలోకి వచ్చారు..దీంతో షర్మిల, విజయమ్మలకు కీలక పదవులు దక్కుతాయని అంతా అనుకున్నారు. కానీ అనూహ్యంగా షర్మిల..తెలంగాణ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. వైఎస్సార్టీపీ పెట్టి అక్కడ రాజకీయం చేస్తున్నారు. అయితే తన అన్నతో విభేదాలు వల్ల తెలంగాణకి వెళ్ళారా? లేక పరోక్షంగా అన్న సపోర్ట్ ఉండటం వల్ల అటు వెళ్ళారా? అనేది క్లారిటీ లేదుఅయితే టీడీపీ విమర్శలు చూస్తే..మళ్ళీ తన పార్టీలో షర్మిలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పి జగనే..ఆమెని సైడ్ చేశారని టీడీపీ నేతలు అంటున్నారు. అదే బాటలో తల్లిని కూడా తప్పించేశారని చెబుతున్నారు. ఆమెని కూడా తెలంగాణకు పంపించేసారని అంటున్నారు. ఇలా షర్మిల పార్టీకి అండగా తెలంగాణలో విజయమ్మ పనిచేస్తున్నారు. ఇక తాజాగా షర్మిల ఇష్యూపై మీడియా విజయమ్మని జగన్ గురించి ప్రశ్నించింది. తెలంగాణలో జరిగిన పరిణామాలపై జగన్ ఏమైనా మాట్లాడారా? ఎంతైనా సిస్టర్ కదా? అని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. అందుకు విజయమ్మ స్పందిస్తూ, 'ఇప్పుడు జగన్మోహన్ రెడ్డితో, ఆ రాష్ట్రంతో మనకేంటమ్మా' అంటూ నవ్వుతూ బదులిచ్చారు. అంటే జగన్ జోక్యం వస్తే తెలంగాణలో రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని చెప్పి విజయమ్మ తెలివిగా సమాధానం ఇచ్చినట్లు కనిపిస్తున్నారు. మొత్తానికి వైఎస్సార్ ఫ్యామిలీ పాలిటిక్స్ ఊహించని విధంగా ఉన్నాయి.

# ఎస్ఐ మెడకు యాక్సిడెంట్ కేసు

ఒంగోలు, డిసెంబర్ 1, అసలే ప్రధాన రహదారి.. అన్ని వాహనాలు రయ్ రయ్ మంటూ దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో ౦ఖ 39 ఐఐ 444నంబర్ఉన్న కారు మాత్రం ఓ చెట్టును బలంగా ఢీకొట్టింది, స్పీడ్ ధాటికి ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారే ఈ రేంజ్‌లో డ్యామేజ్అయిందంటే..లోపలఉన్నవాళ్లసంగతేంటి? అనుకున్నారం తా..కానీకారులోఉన్నదిఇద్దరేఇద్దరు. వారిలో ఒకరు తీవ్రగాయాలతో చనిపోయారు.. మరొకరు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతు న్నారు. ఇంతకీఏంజరిగింది? ప్రమాదం నార్మల్‌గా జరిగిందా? ఇంకేదైనాకోణంఉందా?అనిఆరాతీయగానమ్మలేని నిజాలు వెలుగు లోకి వచ్చాయి. ఏపీలోని ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పలుకూరు దగ్గర ఈనెల 27న రోడ్డు ప్రమాదం జరిగింది. అందరూ అనుకోకుండా జరిగిన యాక్సిడెంట్ అనుకున్నారు. కానీ గంటలు గడిచేకొద్దీ నివ్వెరపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇతను కందుకూరుకు చెందిన మహేష్.. తన ఫ్రెండ్‌తో కలిసి కారులో బయలుదేరాడు. పలుకూరు దగ్గర కారు ఆపి ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఆ క్రమంలో కందుకూరు రూరల్ ఎస్సై శివ నాంచారయ్య వాళ్ల దగ్గరకు వెళ్లాడు. ఫోటోలు తీసేందుకు ప్రయత్నించడంతో యువతి కంగారుపడి బోరున విలపించింది. లాభం లేదనుకున్న మహేష్, తన ఫ్రెండ్ ఇద్దరూ కారెక్కి అక్కడినుంచి వెళ్లిపోయారు. పోలీసులు వెంటాడుతున్నారన్న భయంతో కారు స్పీడ్ పెంచాడు మహేష్. ఆ సమయంలో అదుపు తప్పిన కారు చెట్టును ఢీకొట్టింది. యువతి ప్రాణాలు కోల్పోగా.. మహేష్ ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ట్రీట్‌మెంట్ తర్వాత స్పృహలోకి వచ్చిన మహేశ్.. జరిగిన విషయం చెప్పడంతో అందరూ ఆశ్చర్యపోయారు. కందుకూరు రూరల్ ఎస్సై శివ నాంచారయ్య ఓవరాక్షన్ కారణంగానే కారు వేగంగా నడిపానని.. అప్పుడే యాక్సిడెంట్ జరిగిందని ఆస్పత్రిలో బెడ్‌పై నుంచే స్టేట్‌మెంట్ ఇచ్చాడు మహేశ్. కారు ప్రమాదంపై సింగరాయకొండ ఎస్సై ఫిరోజ్ ఫాతిమా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, పోలీసులు ఓవరాక్షన్ చేసింది నెల్లూరు జిల్లా పరిధిలో.. కారు యాక్సిడెంట్‌కు గురైంది ప్రకాశం జిల్లా లిమిట్స్‌లోకి వస్తుండటంతో.. బాధిత బంధువులు ఇరు జిల్లాల ఎస్పీలకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు.. ప్రాణాలు పోయేలా ప్రవర్తించడం దారుణమన్నారు. యువకుడి పక్కన యువతి ఉంటే ఇష్టం వచ్చినట్టు ఊహించుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు బాధిత కుటుంబసభ్యులు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన ఎస్ఐ శివ నాంచారయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మహేష్ ప్రాణాలతో ఉన్నాడు కాబట్టి అసలు నిజం బయటికొ చ్చింది. ఒకవేళ జరగరానిది జరిగి ఉంటే..? నిజం సమాధి అయ్యేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మహేశ్ బంధువులు. మలుపులు తిరిగిన ప్రమాదం కేసు.. చివరకు ఖాకీ మెడకు చుట్టుకుంది. మరి పోలీస్ ఉన్నతాధికారులు ఎలాంటి యాక్షన్ తీసుకుంటారు..? బాధిత కుటుంబానికి ఏం న్యాయం చేస్తారో చూడాలి

# వైసీపీ ఎమ్మెల్యే కు డబ్బే ముఖ్యం

## కార్యకర్తలు నేతలు కాదంటా..!


మడకశిర శ్రీసత్యసాయిజిల్లా మడకశిర నియోజకవర్గంలోని గుడిబండమండలంలోవైసిపిపార్టీలోనేఆపార్టీ ఎమ్మెల్యే డా.తిప్పేస్వామిపైదళిత సామాజిక వర్గానికి చెందిన నాయకులు తీవ్రవ్యతిరేకత చూపిస్తున్నారు. పార్టీకోసంకష్టపడినకార్యకర్తలుపనులకోసం ఎమ్మెల్యే నుఆశ్రయిస్తేకార్యకర్తలుఅని చూడకుండా డబ్బులు అడుగుతున్నాడని ,నియోజకవర్గంలో ప్రజలకు ఏపని జరగాలన్న అన్నిటికి డబ్బులు చెల్లించాల్సిందేనని ,పేదప్రజలని కూడా చూడకుండా జలగలా పట్టిపీడిస్తున్నాడని,నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనటువంటి సంస్కృతిని ప్రేరేపించాడని నాయకులు ఆరోపించారు. ఈలాంటి వ్యక్తిఎమ్మెల్యేగాకొనసాగేఅర్హతలేదన్నారు. ప్రజలు, మేధావులు, అలోచించి నియోజకవర్గంలో మంచి వ్యక్తిని రాబోయే ఎన్నికల్లో గెలిపించి అబివృద్ధికి బాటలు వేద్దాం అన్నారు నాయకులు..

# 2023 ఏప్రిల్ తర్వాత విశాఖ నుంచే పరిపాలనా...?

విశాఖపట్టణం, డిసెంబర్ 1, 2023 ఏప్రిల్ నుంచి సీఎం జగన్మోహన్ రెడ్డి విశాఖ కేంద్రంగా పరిపాలన చేస్తారని మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రకటించారు. అలా అయితే విశాఖ రాజధాని అయినట్లేనా అంటే మాత్రం చట్ట పరంగా కాదని చెప్పాలి. అయితే సీఎం ఎక్కడ నుంచి అయినా పరిపాలించవచ్చని.. ఫలానా చోటే ఉండాలన్న రూలేం లేదని వైఎస్ఆర్‌సీపీ వర్గాలు కొంత కాలంగా వాదిస్తున్నాయి. అదే సమయంలో రాజ్యాంగంలో రాజధాని అనేదే లేదని అంటున్నారు. ఈ వాదనలతో.. సుప్రీంకోర్టులో అమరావతి అంశం తేలకపోయినా విశాఖ నుంచి జగన్ పాలన చేయాలని నిర్ణయించుకున్నారు. పై స్థాయి అనుమతి లేదని మంత్రి అమర్నాత్ ఈ ప్రకటన చేయరు. విశాఖలో సీఎం క్యాంపాఫీస్ ఉంటే తప్పేమిటని.. ఆయన ఎక్కడి నుంచి అయినా పరిపాలన చేయవచ్చని కొంత కాలంగా వైఎస్ఆర్‌సీపీ మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్ లాంటి వాళ్లు ప్రకటనలు చేస్తున్నారు. రుషికొండ వివాదాస్పద తవ్వకాలు సీఎం క్యాంప్ ఆఫీసుకోమేనన్న ప్రచారం ఉంది. అయితే తప్పేమిటని బొత్స సత్యనారాయణ ఓ సారి ప్రశ్నించారు. ప్రస్తుతం నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గతంలో సుప్రీంకోర్టు గతంలో కూల్చివేసిన భవనాలు ఎంత మేర ఉన్నాయో...ఇప్పుడు కూడా ఆ నిర్మాణాలున్నచోటే కట్టాలని ఆదేశించింది. కానీ ఇటీవల సీపీఐ నేతనారాయణ ఆ ప్రాంతాన్ని పరిశీలించినప్పుడు... పెద్ద స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. అవన్నీ సీఎం క్యాంప్ ఆఫీస్ కోసమేనని భావిస్తున్నారు. అక్కడ నిర్మాణాలు ఏప్రిల్ కల్లా పూర్తయిపోతాయని ... ఆ తర్వాత జగన్ అక్కడి నుంచి పరిపాలిస్తారని చెబుతున్నారు. తాజాగా గుడివాడ అమర్నాథ్ చేసిన ప్రకటన కూడా దీనినే సూచిస్తోంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అమరావతి విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే రాలేదు. సీఆర్డీఏ చట్టంలో పేర్కొన్నట్లుగా ఫలానా తేదీలోపు కట్టివ్వాలన్న అంశంపైనే సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఇప్పటికైతే అమరావతే రాజధాని. సుప్రీంకోర్టులో స్టే రాలేదు. తదుపరి విచారణ జనవరి 31న జరుగుతుంది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ అయ్యాయి. అందరి వాదనలు వినాలి. అందుకే ఈ కేసు విచారణ సుదీర్ఘంగా జరుగుతుందని న్యాయనిపుణులు అంచనా వస్తున్నారు. కేంద్రం సహా అన్ని పక్షాలు తమ వాదనలు వినిపించాలి. ఆ తర్వాత సుప్రీంకోర్టు తీర్పు ఇస్తుంది. అప్పటి వరకూ రాజధానిని కదిలించడానికి అవకాశం లేదు. అలా చేస్తే కోర్టు తీర్పు ఉల్లంఘన అవుతుంది. అయితే వైఎస్ఆర్‌సీపీ మంత్రులు వ్యూహాత్మకంగా ప్రకటనలు చేస్తున్నారు. విశాఖలో ఏప్రిల్ నుంచి రాజధాని అని చెప్పడం లేదు. జగన్ పాలన చేస్తారని చెబుతున్నారు. సీఎం క్యాంపాఫీస్‌గా మార్చుకుని పాలన సాగిస్తారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గతంలో తాము వాదించినట్లుగా..సీఎం పాలన ఎక్కడి నుంచైనా చేయవచ్చని.. ఎవరూ అడ్డుకోలేరని వారు వాదించవచ్చు. వైఎస్ఆర్‌సీపీ నేతల వాదన కరెక్టే. సీఎం జగన్ రాజధాని నుంచే పరిపాలించాలని లేదు. అలాగని సీఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని కాదు. సీఎం జగన్ కర్నూలు లేదా విశాఖ నుంచి పరిపాలన చేస్తే ఎవరూ అభ్యంతరం చెప్పలేరు. ఈ కోణంలోనే విశాఖ నుంచి ఆయన పరిపాలన చేయవచ్చు.

# కోడెల కుటుంబానికి చెక్...

గుంటూరు, డిసెంబర్ 1, (న్యూస్ పల్స్) కోడెల కుటుంబానికి టీడీపీ అధినాయకత్వం చెక్ పెట్టే ఆలోచనలు చేస్తుంది. వచ్చే ఎన్నికల్లో సత్తెనపల్లిలో వైసీపీని ఎదుర్కొనాలంటే కోడెల శివరాం సరిపోడన్నది పార్టీ నేతల అంచనాగా వినిపిస్తుంది. స్పీకర్ గా పనిచేసిన కోడెల శివరాం ఆత్మహత్య చేసుకుని మరణించినా ఆయన కుమారుడి పట్ల కొద్దిగానైనా సెంటిమెంట్ సత్తెనపల్లిలో లేదని గ్రహించిన పార్టీ అధినాయకత్వం శివరాంను దూరం పెట్టాలన్న యోచనలో ఉన్నట్లు కనపడుతుంది. అందుకే కోడెల శివరాం వర్గానికి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాధాన్యత తగ్గిస్తున్నారని ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లాలో ఒకనాడు కోడెల కుటుంబం అంటే ఒక క్రేజ్. పల్నాడు పులిగా ఆయనకు పేరు. నరసారావుపేటలో వైద్యుడిగా కోడెల శివప్రసాదరావు అందరికీ సుపరిచితుడే. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టిన తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన కోడెల ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. డాక్టర్ గా ఎంత సక్సెస్ అయ్యారో.. అంతకు మించి పొలిటీషియన్ గా విజయవంతమయ్యారు. 1983 నుంచి 1999 వరకూ వరసగా జరిగిన ఐదు ఎన్నికల్లోనూ నరసరావుపేట నుంచి కోడెల శివప్రసాదరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మంత్రి పదవి దక్కేది. సీమలో పరిటాల, పల్నాడులో కోడెల క్రేజ్ ఉన్న నేతలుగా పార్టీలో గుర్తింపు ఉండేది. సత్తెనపల్లిలో గెలిచినా... 2014 ఎన్నికల్లో నరసరావుపేట కాదని కోడెల శివరాంను తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లికి పంపింది. సత్తెనపల్లిలో ఆయన సొంత గ్రామం ఉండటంతో అక్కడ పోటీ చేయాలని ఆదేశించింది. 2014లో గెలిచిన కోడెల శివప్రసాద్ స్పీకర్ గా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికలలో తిరిగి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దానికి ప్రధాన కారణం కుటుంబ సభ్యుల అవినీతి, అక్రమాలేనన్న టాక్ ఉంది. కారణాలు తెలియదు కాని ఆయన హైదరాబాద్ తన ఇంట్లో ఆత్మహత్య చేసుకుని మరణించారు. కోడెల స్పీకర్ గా ఉన్న సమయంలో గుంటూరు జిల్లాలోనూ, సత్తెనపల్లిలోనూ ఆయన కుమారుడు కోడెల శివరాంపై అనేక ఆరోపణలు వచ్చాయి. పార్టీ నేతలనే పట్టించుకునేవారు కాదని, కార్యకర్తలను కూడా దగ్గరకు తీయకుండా వ్యవహరించేవారని అంటారు. . కోడెల శివప్రసాద్ మరణం తర్వాత సహజంగా ఆయన కుమారుడు కోడెల శివరాంకు పార్టీ పగ్గాలు అప్పగిస్తుంది. ఆత్మహత్య చేసుకున్నారని సెంటిమెంట్ పనిచేసి ఖచ్చితంగా టీడీపీకి సీటు దక్కుతుందని ఎవరైనా భావిస్తారు. కానీ కోడెల శివరాంకు సొంత పార్టీలోనే వ్యతిరేకత



తీవ్రమయింది. అక్కడ మూడు గ్రూపులు తయారయ్యాయి. ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు చేపట్టడం సహజంగా మారిపోయింది. అందుకే ఇప్పటి వరకూ సత్తెనపల్లికి ఎవరినీ ఇన్‌ఛార్జి పదవిని చంద్రబాబు అప్పగించలేదు. ఇన్‌ఛార్జి పదవి ఖాళీ అయి మూడున్నరేళ్లవుతున్నా అక్కడ నియమించలేదంటే చంద్రబాబు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కోడెల కుటుంబం అంటే చంద్రబాబుకు గౌరవమే. కానీ అదే సమయంలో శివరాంకు టిక్కెట్ ఇస్తే గెలవడం కష్టమన్న నివేదికలు రావడంతో ఆయనను ఎంపిక చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. కోడెల వ్యతిరేక వర్గానికి.... తాజాగా కోడెల శివరాం వర్గానికి చెక్ పెడుతూ చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పల్నాడు ప్రాంత తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశమైంది. పార్టీ పదవులను అధినాయకత్వం భర్తీ చేసింది. అందులో మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు వర్గానికే ఎక్కువ పదవులు దక్కాయి. దీంతో కోడెల శివరాంను పార్టీ హైకమాండ్ పొమ్మనకుండానే పొగపెడుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అందరినీ ఒక తాటిపైకి తెచ్చేందుకే అని హైకమాండ్ చెబుతుంది. వచ్చే ఎన్నికల్లో సత్తెనపల్లి సీటు ఎవరికి దక్కుతుందో ఇప్పుడే చెప్పలేం. పొత్తులు ఉంటే... కుదిరితే.. మిత్రపక్షాలకు ఆ సీటు వెళ్లే అవకాశాలు లేకపోలేదు. అందుకే చంద్రబాబు ఇన్‌ఛార్జి పదవిని ఇన్నాళ్లు భర్తీ చేయలేదనుకుంటున్నా, అక్కడ కోడెల శివరాం కు మాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. మరి శివరాం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది పల్నాడు రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది.

# సింహపురిలో చికెన్... జాగ్రత్త

నెల్లూరు, డిసెంబర్ 1, నెలరోజుల క్రితం నెల్లూరు నగరానికి చెన్నైనుంచి వచ్చిన కుళ్లిన చికెన్ ని హెల్త్ ఆఫీసర్స్ సీజ్ చేశారు. వారు నిఘా పెట్టిన తర్వాత ఇప్పుడు చెన్నై నుంచి కుళ్లిన చికెన్ సరఫరా నిలిచిపోయింది. కానీ తాజాగా నెల్లూరులోనే అలాంటి ముఠా బయలుదేరింది. అమ్ముడుపోగా మిగిలిన చికెన్, అనారోగ్యంగా ఉన్న కోళ్లనుంచి తీసిన మాంసం. ఇతరత్రా పాడేపోయిన చికెన్ ని నెల్లూరు నగరం వెంకటేశ్వర పురంలోని ఓ చికెన్ స్టాల్ లో దాచి ఉంచారు. ఇటీవల స్థానికులు ఈ చికెన్ స్టాల్ లో మాంసం కొనగా అది చెడిపోయినట్టు తేలింది. దీంతో అధికారులు ఆ చికన్ స్టాల్ పై దాడి చేశారు. ఫ్రిడ్జ్ లలో దాచి ఉంచిన 100 కేజీల చికెన్ ని సీజ్ చేశారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నా కూడా హెల్త్ ఆఫీసర్స్ దాడి చేసి కుళ్లిన చికెన్ బండారాన్ని బట్టబయలు చేశారు. దీంతో నెల్లూరులో చికెన్ కొనాలంటేనే ప్రజలు హడలిపోతున్నారుకార్తీకమాసం పూర్తి కావడంతో ఇప్పుడిప్పుడే చికెన్ కి డిమాండ్ పెరుగుతోంది. అయితే జిల్లాలో అయ్యప్ప స్వాముల మాలధారణ కార్యక్రమాలు కూడా జోరుగా సాగుతున్నాయి. దీంతో చికెన్ అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. జనవరికల్లా పరిస్థితి మెరుగవుతుంది. ఈదశలో ఇప్పుడు నిల్వచేసిన చికెన్ వార్తల్లోకెక్కింది. సహజంగా మనముందే చికెన్ ముక్కలుగా కట్ చేసి ఇస్తారని ధీమాగా ఉంటాం. కానీ కొన్నిచోట్ల నిల్వ చేసిన చికెన్ ని కూడా వాటితో కలిపి ఇచ్చేస్తారు. వాటిని తీసుకెళ్లి వెంటనే ఉడకబెట్టేందుకు సిద్ధం చేస్తారు కాబట్టి దానిలో మార్పు మనం గమనించలేం. అందుకే ఇలాంటి చికెన్ ని అంటగట్టేస్తారు. అయితే కుళ్లిన చికెన్ ని ప్రత్యేకంగా హోటళ్లకు సరఫరా చేస్తుంటారు. ఇటీవల చెన్నై నుంచి ఇలాంటి కుళ్లిన చికెన్ నెల్లూరుకి సరఫరా అయ్యేది. ఆమధ్య హెల్త్ ఆఫీసర్స్ దాడులు చేయడంతో అలాంటి సరఫరా తగ్గింది. అలా తెప్పించిన కుళ్లిన చికెన్ ని కొన్ని హోటళ్లు తక్కువ రేటుకి కొనుగోలు చేస్తుంటాయి. ఇప్పుడు చెన్నై నుంచి సరఫరా తగ్గిపోవడంతో.. నెల్లూరులోనే పారేయాల్సిన చికెన్ ని ఫ్రిజ్ లలో దాచిపెడుతున్నారు. దాన్ని హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. హోటల్ కి వెళ్లి చికెన్ ఐటమ్ ఆర్డర్ ఇస్తే కాస్త ఆలస్యంగా అయినా వేడి వేడి చికెన్ తెచ్చి వడ్డిస్తారు. ఈ వేడి చికెన్ టేస్ట్ మనం పెద్దగా గమనించలేకపోవచ్చు. వేడివేడిగా ఆరగించేస్తాం కాబట్టి తేడా తెలియదు. అయితే దానివల్ల ఫుడ్ పాయిజనింగ అందుకే సహజంగా హోటళ్లలో బోన్ లెస్ ఐటమ్ కంటే, బోన్ ఐటమ్ ఆర్డర్ చేయమని చెబుతుంటారు. చికెన్ కుళ్లిపోతే దానినుంచి ఎముకను తీసివేసి నిల్వ చేస్తుంటారు. బోన్ లెస్ చికెన్ అయితే కుళ్లినది వండి వడ్డించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. అందుకే బోన్ లెస్ ఆర్డర్ చేస్తే కుళ్లిన చికెన్ కి అవకాశం ఉండదని చెబుతుంటారు.



# నేడు జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే అంటే జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం అన్నమాట. ప్రతీ ఏడాది డిసెంబర్ 2 వ తేదీన ఈ నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే జరుపుకుంటారు. ఈ ఏడాది జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవానికి ఉన్న ప్రత్యేకత, ప్రాధాన్యత, చరిత్ర నేపథ్యం ఏంటో ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. భోపాల్ గ్యాస్ దుర్ఘటన గురించి అందరికీ తెలిసిందే. 1984లో డిసెంబర్ 2, 3 తేదీల్లో రాత్రి జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో చనిపోయిన వారిని స్మరించుకుంటూ ప్రతీ ఏడాది అదే తేదీ అయిన డిసెంబర్ 2 న జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కెమికల్ ఫ్యాక్టరీ నుంచి మిథైల్ ఐసోసైనేట్ అనే విష రసాయనాలు లీకైన కారణంగా ఈ ఘటన చోటుచేసుకుంది. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం లక్ష్యం:ప్రతీ ఏడాది కాలుష్యంతో ప్రపంచ మానవాళికి జరిగే నష్టాన్ని తెలియజెప్పేందుకే నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డేను నిర్వహిస్తున్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించడం వెనుకున్న మరో లక్ష్యం ఏంటంటే.. పౌరులు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడేలా వారికి అవగాహన కల్పించడమే. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవానికి ముందుగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కాలుష్యంపై పలు గణాంకాలు విడుదల చేసింది. ఈ ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో జరిగినంత గాలి కలుషితం గత ఏడు సంవత్సరాల్లో ఎన్నడూ జరగలేదని జాతీయ కాలుష్య నివారణ మండలి పేర్కొంది.

